ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
శుక్రవారం 13 జూన్ 2025





హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చప్పట్లతో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



సిద్దిపేటలో స్కూల్‌లోకి వస్తున్న విద్యార్థులు



సిద్దిపేటలో గొడుగుతో వస్తున్న విద్యార్థిని

బడి గంట మోగింది

నెలన్నర తరువాత బడి గంట మోగింది. వేసవి సెలవులు ముగియడంతో గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులంతా తిరిగి బడిబాట పట్టారు. పాఠశాలలను అలంకరించిన ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికారు. వచ్చిన వారందరికీ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. - న్యూస్ నెట్‌వర్క్

ప్రైవేట్ మోజులో పడొద్దు

ప్రభుత్వ బడుల్లో చదివి పైస్థాయికి వచ్చిన వాళ్లమే

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



అక్కన్నపేట మండలం రేగొండలో మూతపడిన ప్రభుత్వ పాఠశాలను చిన్నారి చేత పునఃప్రారంభిస్తున్న మంత్రి, కలెక్టర్

అక్కన్నపేట/సిద్దిపేట అర్బన్/హుస్నాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల మోజులో పడొద్దని, వారు చేసే ఆర్భాటాలకు ఆకర్షితులు కావద్దని, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివిస్తే నామూషీగా భావించొద్దని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లితండ్రులకు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి కేజీబీవీనీ గురువారం మంత్రి సందర్శించి విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని తీసుకున్నారు. అనంతరం అక్కన్నపేట మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. నాలుగేళ్లుగా మూతపడిన రేగొండ ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ మనుచౌదరితో కలిసి విద్యార్థిని చేత ప్రారంభించారు. హుస్నాబాద్ పట్టణంలోని కేజీబీవీలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తాను, కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఈ స్థాయికి చేరుకున్నవాళ్లమేనన్నారు. నేటి రాజకీయ వ్యవస్థలో చాలామంది మంత్రుల స్థాయిలో ఉన్నవాళ్లు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని వచ్చారని గుర్తుచేశారు. పాఠశాలల పునః ప్రారంభ సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు యూనిఫామ్ అన్ని ముందస్తుగానే అందిస్తున్నామని, డైట్, కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచామని, ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఎంఈవోలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకునూరు బడి గేటుకు తాళం

చేర్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంవత్సరం ప్రారంభం రోజే ఆకునూరు జడ్పీఎస్ఎస్ గేట్‌కు తాళం పడింది. డైనింగ్‌హాల్ నిర్మాణం పూర్తి చేసినప్పటికీ పెండింగ్ బిల్లు చెల్లించకపోవడంతో ఎస్ఎంసీ మాజీ చైర్మన్ కోతి దాసు గురువారం తాళం వేసి నిరసన చేపట్టారు. రూ.15 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేస్తే, అప్పట్లో సుమారు రూ.7లక్షలు చెల్లించగా, మిగతా రూ.8 లక్షలు రావాల్సి ఉందని ఆయన మండిపడ్డారు. తొలిరోజు కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కొంతసేపు బయటే నిలబడిపోయారు. చివరకు డీఈవోతో మాట్లాడించి త్వరితగతిన బిల్లు వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కోతి దాసు తాళం తీశాడు.



తాళంవేయడంతో బయట వేచి ఉన్న ఉపాధ్యాయులు

పాఠశాలలో పాము కలకలం

రాయపోల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం తిరిగి తెరుచుకోగా రాయపోల్ మండలం ఉదయపూర్ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులతో పాటు ఓ పాము కూడా వచ్చింది. బడిలోని వంట గదిలోకి వెళ్లింది. విషయాన్ని స్థానిక ఉపాధ్యాయుడు కరుణాకర్, ఎంఈవో సత్యనారాయణరెడ్డి తెలుపగా ఆయన పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. పాము వంటగదిలోని మొక్కజొన్న బెండ్లలోకి వెళ్లడంతో గ్రామస్థులు వచ్చి చంపడానికి ప్రయత్నించినా దొరకలేదు. చివరకు గదిలో ఉన్న బెండ్లను కాల్చివేశారు. కానీ, సాయంత్రం పాము గదిలో నుంచి బయటకు తిరిగి వెళ్లిపోయింది. దీంతో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం లేకుండా పోయింది.

కలెక్టర్‌గా హైమావతి

- మనుచౌదరి మేడ్చేల్-మల్కాజిగిరి జిల్లాకు బదిలీ



హైమావతి

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెద్దఎత్తున ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. 36 మంది అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం సీఎస్ రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట కలెక్టర్‌గా 2024 ఫిబ్రవరి నుంచి విధులు నిర్వర్తిస్తున్న మనుచౌదరిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు బదిలీ చేశారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్న కె.హైమావతిని జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా గడ్డం వివేక్‌వెంకటస్వామి



ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, జూన్ 12: ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా గడ్డం వివేక్ వెంకటస్వామిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు గనులు, కార్మిక, ఉపాధి కల్పన శాఖలు అప్పగించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కొనసాగారు. ప్రభుత్వం తాజా ఉత్తర్వులతో ఆమె స్థానంలో గడ్డం వివేక్ వెంకటస్వామిని నియమించింది.

సఖి కేంద్రానికి ఆరేళ్లు

- 1,387 కేసుల పరిష్కారం



సఖి కేంద్రం వద్ద అధికారులు, సిబ్బంది

సిద్దిపేట క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సఖి కేంద్రం ఏర్పాటు చేసి ఆరు సంవత్సరాలు పూర్తయిందని, ఇప్పటివరకు 1387 కేసులను ఈ కేంద్రాం పరిష్కారించామని అధికారులు తెలిపారు. గురువారం వారు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సఖీ కేంద్రంలో 1,535 కేసులు నమోదు అయ్యాయని, వాటిలో 868 గృహహింస, 111 వరకట్నపు, 112 చీటింగ్, 144 మిస్సింగ్, కిడ్నాపింగ్, 58 పోక్సో కేసులు, 23 బాల్య వివాహాలు, 219 ఇతర కేసులు ఉన్నట్లు తెలిపారు. వీటిలో 1,387 కేసులను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు, 148 కేసులు ఇంకా పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. 1,523 మందికి కౌన్సెలింగ్ చేసి, మనోధైర్యాన్ని కల్పించడంతోపాటు, 647 మందికి న్యాయ సలహా, 308 మందికి ప్రభుత్వ హాస్పిటల్‌లో వైద్య సహాయం, 197 పోలీస్ సపోర్ట్ ఇప్పించామని పేర్కొన్నారు. సఖి కేంద్రంలో 841 మంది తాత్కాలిక వసతిని పొందడంతోపాటు, 301 మందికి కిట్లు అందజేసినట్లు వివరించారు. అలాగే ఈ కేంద్రం నుంచి 58 మందిని పలు సేవా సంస్థలకు పంపించినట్లు తెలిపారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డెక్కితే సీజ్ చేస్తాం

- ఎంవీఐ శంకర్ నారాయణ

సిద్దిపేట క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్నామని మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ నారాయణ తెలిపారు. ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డెక్కితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. గురువారం సిద్దిపేటలోని పలు ప్రాంతాల్లో రవాణా శాఖ అధికారులు స్కూల్ బస్సులను తనిఖీ చేసి, వాహన డాక్యుమెంటులు పరిశీలించారు.

ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించాలని రాష్ట్రమంతటా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం చేపడుతుంటే.. ఇక్కడ మాత్రం ఇందుకు భిన్నంగా తల్లిదండ్రులే సర్కారు బడికి వరుస కడుతున్నారు. అంతేనా.. ఓ తండ్రి ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే సిఫారసు లెటర్ తెచ్చారు.. ఇది సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లకు ఉన్న డిమాండ్. విద్యార్థుల ప్రవేశాలలో ఇందిరానగర్ బడి ప్రత్యేకతను చాటుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో నూతన ఒరవడిని సృష్టిస్తోంది.

- ఇప్పటికే 600పైగా దరఖాస్తులు
- గతేడాది రికార్డు స్థాయిలో 1,217 మంది విద్యార్థులు
- పలుమార్లు నో అడ్మిషన్ బోర్డు తగిలించిన ఏకైక స్కూల్
- ప్రస్తుతం 180 ఖాళీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ప్రజాప్రతినిధులు, నాయకుల నుంచి సిఫారసులు





క్యూఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకుంటున్న దృశ్యం

ఇందిరానగర్ బడి.. నూతన ఒరవడి

సర్కారు బడుల ప్రవేశాల్లో టాప్.. కార్పొరేట్ స్కూళ్లకు మించి క్రేజ్

సిద్దిపేట ప్రతినిధి, ఆంధ్రజ్యోతి, జూన్ 12 : పదేళ్ల క్రితం 300 మంది విద్యార్థులకు పరిమితమైన సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల నేడు 1200 మందికిపైగా చదువుతున్నారు. ఐదు తరగతులకు 23 సెక్షన్లు ఉన్నాయి. కార్పొరేట్ పాఠశాలలకు మించి డిమాండ్ ఉన్న పాఠశాల ఇది. కంప్యూటర్ ల్యాబ్‌లు, ఫారెన్ లాంగ్వేజీ బోధన, ఆన్‌లైన్ తరగతులు ఐఐటీ ఫౌండేషన్ విద్య, విశాలమైన ఆట మైదానం, ఆధునిక సౌకర్యాలతో 24 తరగతి గదులు ఉన్నాయి. ఒక్కో సబ్జెక్టుకు నిష్ణాతులైన నలుగురు ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు.

హరీశ్‌రావు చొరవతో..

ఈ పాఠశాలకు గుర్తింపు రావడంలో స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు కీలకంగా వ్యవహరించారు. పలు కార్పొరేట్ పరిశ్రమల సహకారం తీసుకొని ఇక్కడ తరగతి గదులు కట్టించారు. అదే విధంగా కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయించారు. డిజిటల్ క్లాస్‌రూములను సిద్ధం చేశారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు నెలలో రెండుసార్లు ఈ పాఠశాలను ఆకస్మికంగా విజిట్ చేసిన సందర్భాలు ఉన్నాయి. విదేశీ భాషలు, ఐఐటీ ఫౌండేషన్ కోర్సుల కోసం కృషి చేశారు. అంతేగాకుండా మిగతా 7వ పేజీలో

సీఎం ఆఫీసు నుంచి సిఫారసు

ఇందిరానగర్ పాఠశాలలో సీటు కోసం సిద్దిపేటకు చెందిన ఓ వ్యక్తి సీఎం ఆఫీసు నుంచి సిఫారసు లేఖ తేవడం చర్చనీయాంశంగా మారింది. సీఎం ఆఫీసు నుంచి ఈ లెటర్ జిల్లా విద్యాధికారికి చేరగా.. అక్కడి నుంచి పాఠశాలకు పంపించారు. అయితే సీట్ల ఖాళీలు, ఇతర అంశాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే సీటు కేటాయింపు చేయడానికి యోచిస్తున్నారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, నేతల పైరవీలు తక్కువేమీ కాదు. అయినా ఇక్కడ అడ్మిషన్లు ఇవ్వడంలో ఆచితూచి వ్యవహరిస్తుంటారు. తాను చెప్పినా ఇందిరానగర్ పాఠశాలలో సీటు ఇవ్వరని పలు సందర్భాల్లో మంత్రిగా ఉన్నప్పుడు హరీశ్‌రావే వేదికలపై మాట్లాడారు.

వైద్య బృందం ఆధ్వర్యంలో 'వాకథాన్'

సిద్దిపేట అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ సర్జన్స్ వీక్ సందర్భంగా గురువారం సిద్దిపేటలో సురబి మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో వైద్యులు, మెడికల్ సిబ్బంది కలిసి వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట బీజేఆర్ చౌరస్తా నుంచి స్థానిక పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ రఫీ, సర్జరీ ప్రొఫెసర్ ఐలయ్య ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సిద్దిపేట ప్రెసిడెంట్ వైస్ ప్రెసిడెంట్ ప్రధాన కార్యదర్శి, సిద్దిపేట జనరల్ సర్జరీ విభాగం వైద్యులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వాకథాన్‌లో పాల్గొన్న మెడికల్ కళాశాల సిబ్బంది

కాంగ్రెస్‌కు ఓట్లు వేసి తప్పు చేశామంటున్నారు

మంత్రివర్గంలో యాదవులకు దక్కని పదవులు : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్



ఆయిల్‌పామ్ గెలను కోస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 12 : కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి తప్పు చేశామని యాదవులు ఒప్పుకుంటున్నారని, ఆ విషయాన్ని ఇప్పటికైనా గ్రహించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని శ్రీకృష్ణ యాదవ సంఘంలో యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో గురువారం ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సహకాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించగా హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదవులకు కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గంలో అవకాశం ఇవ్వలేదని తెలిపారు. కేసీఆర్ యాదవుల కోసం హైదరాబాద్‌లోని కోకాపేటలో ఆత్మగౌరవ భవనాలు నిర్మించారని గుర్తుచేశారు. ఆసుపత్రుల్లో మందులు లేవని, తాగుబోతులకు మాత్రం మంత్రి ఉన్నాడన్నారు. పాఠశాలలు ప్రారంభం అయిన విద్యాశాఖకి మంత్రి దిక్కులేడన్నారు. అన్నప్రసాద వితరణ కోసం అమర్‌నాథ్ వెళ్తున్న సరుకుల వాహనాన్ని ఎమ్మెల్యే హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఇటీవల నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ ఉచిత సమ్మర్ క్యాంపు శిబిరంలో శిక్షణ పొందిన 70 మంది క్రీడాకారులకు సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు సర్టిఫికెట్‌లను, మెడల్స్‌ను అందజేశారు. అనంతరం నంగునూర్ మండలం రాంపూర్ గ్రామంలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేసిన యువతను ఆయన అభినందించారు.

నా కల సాకారమైంది

సిద్దిపేట రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : స్థిరమైన ఆదాయం కోసమే ఆయిల్ పామ్ సాగు వైపు రైతులను ప్రోత్సహించామని, వారు ఈ ఫలితాలు అనుభవిస్తుంటే సంతోషంగా ఉందని, నా కల సాకారమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నారాయణరావుపేట మండలం గోపులాపూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ బాలకృష్ణ ఆయిల్‌పామ్ తోటలో గురువారం నిర్వహించిన తొలి గెలల కోత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని నర్మెట్టలో రూ. 350 కోట్లతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్ పామ్ పంటకు రాళ్ల వాన వరం, చీడపీడల బాధ లేదన్నారు. అశ్వారావుపేట రైతుల తరహాలో సిద్దిపేట రైతులు అభివృద్ధి చెందాలన్నది తన కోరికనని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రిఫైనరీలకు కొమ్ము కాస్తుందా, రైతులకు కొమ్ము కాస్తుందా చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఏడాదిలో లక్ష కోట్ల నూనె గింజలను ఇతర దేశాల నుంచి కొనుగోలు చేస్తోందని వివరించారు. కాంగ్రెస్ వచ్చాక ఆయిల్‌పామ్ పంటను పట్టించుకోవడం లేదని, బీఆర్ఎస్ హయాంలోనే సాగు పెరిగిందని తెలిపారు. పదవులు ఉంటాయి, పోతాయని, కానీ రైతులకు సేవ చేయడమనేది చరిత్రలో శాశ్వతంగా ఉంటుందన్నారు. యువత ఆన్‌లైన్ గేమ్స్ ఆడి జీవితాలు నాశనం చేసుకొంటున్నారని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

కొమురెల్లి మల్లన్నకు పోచంపల్లి పట్టు వస్త్రాలు

ఆలయం వద్దే తయారు చేయించి మొక్కు తీర్చుకోనున్న భక్తుడు

చేర్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : కోరమీసాల కొమురవెల్లి మల్లన్నతో పాటు స్వామివారి చెంతన కొలువైన కేతలమ్మ, మేడలాదేవీ అమ్మవార్లకు పోచంపల్లి పట్టువస్త్రాలను అందజేశాడు ఓ భక్తుడు. హైదరాబాద్ పాతబస్తీకి చెందిన మల్యాల మదుసూదన్ ప్రముఖ ఆలయాల్లోని దేవతా మూర్తులకు పట్టు వస్త్రాలను అక్కడే మగ్గంపై తయారు చేయించి మొక్కుబడిగా అందిస్తున్నాడు. ఈ క్రమంలో కొమురవెల్లి మల్లన్నకు పట్టు ధోతి, శెల్లా, కేతలమ్మ, మేడలాదేవీలకూ చీరలు నేయిస్తానని ఆలయాధికారులకు తెలిపాడు. దీంతో ఈవో అన్నపూర్ణ అంగీకరించడంతో గురువారం ఆయన చేనేత కార్మికులను రప్పించి మగ్గం ఏర్పాటు చేయించారు. ఈవో అన్నపూర్ణ నేత పనులు ప్రారంభించారు. పది రోజుల్లోగా వస్త్రాలు సిద్ధం కానున్నాయి.



మల్లన్న ఆలయ కార్యాలయంలో మగ్గంపై చీరనేయడం ప్రారంభిస్తున్న ఈవో అన్నపూర్ణ

మేలైన విత్తనంతోనే..మెరుగైన పంట
సాగులో విత్తన ఎంపికే కీలకం
కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తత తప్పనిసరి
7
ఎవరెస్ట్ అధిరోహించిన ఎంజేపీ స్కూల్ విద్యార్థులు

ఇరిగేషన్ సిబ్బందిపై దాడి ఘటనలో ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నర్సాపూర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టితరలింపును అడ్డుకోబోయిన ఇరిగేషన్ సిబ్బందిపై దాడికి యత్నం.. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకవడం లేదన్న విషయమై ఆంధ్రజ్యోతిలో గురువారం వచ్చిన కథనానికి అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఐదు రోజుల క్రితం నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్‌లో రాత్రి సమయంలో శివ్వంపేట మండలం కొత్తపేట ఇటుకబట్టీలకు అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. దీంతో కొందరు వారిపై దాడికి యత్నించి సెల్‌ఫోన్లు, గుర్తింపు కార్డులు సైతం లాగేసుకుని దౌర్జన్యం చేశారు. ఈ విషయమై మరుసటి రోజు నర్సాపూర్ ఎస్‌ఐ వద్దకు వెళ్లి వివరించగా.. జరిగిన ఘటన శివ్వంపేట మండల పరిధిలో జరిగినందున అక్కడి ఎస్‌ఐకి ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో అక్కడకు వెళ్లి దాడిపై ఎస్‌ఐ ఫిర్యాదు చేయడానికి యత్నించగా.. వారిపైనే దురుసుగా వ్యవహరించి తిరిగి పంపాడని ఇరిగేషన్ సిబ్బంది తెలిపారు. ఇదే విషయాన్ని బాధిత సిబ్బంది విలేకరులతో వాపోగా.. ఆంధ్రజ్యోతిలో కథనం ప్రముఖంగా ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా పోలీసు అధికారులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో దాడికి గురైన సిబ్బంది తిరిగి గురువారం లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదును శివ్వంపేట పోలీసులు స్వీకరించారు. తుజాల్‌పూర్‌లో చెరువు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టితరలించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ పోలీసులకు నీటిపారుదల శాఖ ఏఈ మణిభూషన్ ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

చోరీ అడ్డుకున్నాడని.. అంతమొందించారు

- పాశమైలారం సెక్యూరిటీ గార్డు హత్య కేసులో వీడిన మిస్టరీ
- వివరాలు వెల్లడించిన పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్


వివరాలు విల్లడిస్తున్న డీఎస్పీ

పటాన్‌చెరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పాశమైలారం ఉష మాగవైర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఏప్రిల్ 16న జరిగిన సెక్యూరిటీ గార్డ్ ఖైరత్ మియా (52) హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ వెల్లడించారు. బొంతపల్లి గ్రామంలో నివాసముండే బిట్టు, మహ్మద్ మజీద్ అలియాస్ మున్నా, రోషన్ కుమార్, మహ్మద్ సద్దాం, వికాస్ కుమార్, నర్సింగ్ రావు అలియాస్ యోహాన్, వినీత్ కుమార్ గౌడ్‌లతో పాటు ఒక మైనర్ అదే కాలనీలో క్రికెట్ ఆడే సమయంలో ఒకరికొకరు పరిచయమయ్యారు. వీరంతా జల్సాలకు అలవాటు పడ్డారు. మూడు నెలల క్రితం అందరూ కలిసి మద్యం తాగే సమయంలో లేబర్ పనులతో వచ్చే డబ్బులు సరిపోవడం లేదని, దొంగతనం చేయగా వచ్చే డబ్బులతో జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నారు. పాశమైలారం గ్రామంలోని వివిధ కంపెనీలలో లేబర్ పని చేసే క్రమంలో అక్కడ గల ఉషా మాగవైర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కాపర్ వైర్ గమనించిన బిట్టు.. దానిని దొంగిలించేందుకు మిగతవారితో కలిసి ప్లాన్ వేశాడు. ముందు రోజు పరిశ్రమకు వెళ్లినా సెక్యూరిటీ గార్డు మెలుకవగా ఉండటంతో వెనక్కి వచ్చేసారు. తిరిగి ఏప్రిల్ 16న అర్ధరాత్రి ఆ పరిశ్రమలోకి చొరబడి కాపర్ వైర్ తీస్తుండగా విధి నిర్వహణలో ఉన్న సెక్యూరిటీ గార్డు ఖైరత్ మియా గమనించి వారిపై టార్చ్ లైట్ వేశాడు. దీంతో వెంటనే వారంతా సెక్యూరిటీ గార్డ్‌పై దాడి చేసి హత్య చేశారు. నిందితుల్లో ఒకరు యూపీ, మరొకరు బీహార్‌కు చెందినవారు కాగా, మిగతావారందరూ బొంతపల్లి గ్రామానికి చెందిన వారేనని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో బిట్టుతో పాటు మైనర్ యువకుడు పరారీలో ఉన్నారని మిగతావారిని రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ఈ కేసు చేదించిన ఇన్‌స్పెక్టర్‌లు స్వామిగౌడ్, శివకుమార్, రామనాయుడు తతర సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

నిందితుడు అరెస్ట్

వెల్దుర్తి, జూన్12(ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గురువారం ఎస్‌ఐ రాజు తెలిపారు. ఈ మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన హనుమాద్రి లక్ష్మయ్య నెల 5వ తేదీన ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన నిందితుడు తాళాన్ని పగులగొట్టి రూ. 90వేల నగదును దొంగిలించాడు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన కుస్తీ కార్తీక్(23)పై అనుమానంతో అదుపులోకి తీసుకోని విచారణ చేయగా అతడు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దొంగిలించిన నగదును ఖర్చు పెట్టగా, మిగిలిన రూ. 23వేలను, సెల్‌ఫోన్, చోరికి ఉపయోగించిన ఇనుప పైప్‌ను స్వాధీనం చేసుకోని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల5న జరిగిన

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్


వివరాలను వెల్లడిస్తున్న సీఐ రేణుకారెడ్డి

రేగోడ్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : బోరు బావుల మోటర్ల చోరీ కేసును రేగోడ్ పోలీసులు ఛేదించారు. గురువారం రేగోడ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అల్లాదుర్గం సీఐ రేణుకా రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. రేగోడ్ పరిసర ప్రాంతాలలోని వ్యవసాయ బోరు మోటర్లు చోరికి గురవుతుండటంతో భాధిత రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులతో మోటర్ల పై నిఘా పెట్టామన్నారు. కొండాపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఫిర్యాదుతో తమ పోలీస్ సిబ్బంది తనిఖీలు చేయగా బోరు మోటర్ల చోరి నిందితుడు పట్టుబడ్డారన్నారు. రేగోడ్ మండల పరిదిలోని పెద్దతండాకు చెందిన కిషన్ నాయక్, హరిజానాయక్‌ల వద్ద ఉన్న ఐదు మోటర్లను, రెండు స్టాండ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల పై కేసు నమోదు చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ మోటర్ల చోరీ కేసును చాకచక్యంగా చేదించిన ఏఎస్ఐ శంకర్, కానిస్టేబుల్ వినోద్, నరేష్‌లను సీఐ అబినందించారు.

400 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత


పోలీసుల అదుపులో నిందితుడు

మునిపల్లి, జూన్12 (ఆంధ్రజ్యోతి) : కర్నాటక రాష్ట్రం బీదర్ నుంచి ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 400ఎండు గంజాయిని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, ప్రొహిబిషన్ అధికారులు గురువారం కంకోల్ టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నవీన్ చంద్ర వెల్లడించారు. కర్నాటక రాష్ట్రం బీదర్ నుంచి ఆర్టీసీ బస్సులో గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో గురువారం మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానం వచ్చిన ఆర్టీసీ బస్సును తనిఖీ చేయగా మనీ అనే వ్యక్తి వద్ద 400 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయితోపాటు ఒక మొబైల్‌ను స్వాధీనం చేసుకొని సంగారెడ్డిలోని ఎక్సైజ్ స్టేషన్ తరలించారు. అదే విధంగా గోవా నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేయగా వివిధ బ్రాండులకు సంబంధించి 5.190లీటర్ల సుంకం చెల్లించని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా టాస్క్ ఫోర్స్ స్టేషన్ టీం ఎస్ఐలు హన్మంత్, అనుదీప్, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రులకు అప్పగింత

పటాన్‌చెరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం పటాన్‌చెరు ప్రాంతానికి వలస వచ్చిన బీహార్‌కు చెందిన దంపతుల పిల్లలు ఐదు మంది బుధవారం తప్పిపోయారు. పటాన్‌చెరు వీధుల్లో తచ్చాడుతున్న పిల్లల్ని గమనించి పటాన్‌చెరు పోలీసులు అక్కున చేర్చుకున్నారు. భాష కూడా తెలియకపోవడంతో మూడు నుంచి 9ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులు బిక్కుబిక్కుమంటూ తల్లిదండ్రుల కోసం ఎదురు చూస్తున్నారు. పోలీసులు వారిని స్థానిక హాస్టల్‌లో చేర్చి సంరక్షించారు. తల్లిదండ్రుల ఆచూకీ కనిపెట్టి గురువారం స్టేషన్‌కు పిలిపించి పిల్లల్ని అప్పగించారు. పిల్లల పట్ల అజాగ్రత్తగా ఉండకూడదని తల్లిదండ్రులకు ఇన్‌స్పెక్టర్ వినాయకరెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు.


ఐదుగురు పిల్లల్ని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ వినాయకరెడ్డి

వాకింగ్‌కు వెళ్లి మృత్యు ఒడిలోకి..

- రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి


లక్ష్మయ్య(ఫైల్)

కోహెడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వాకింగ్‌కు వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన గాండ్ల లక్ష్మయ్య(56) కరీంనగర్ 1 డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం శనిగరంలోని తన ఇంటి నుంచి వాకింగ్‌కు రాజీవ్ రహదారి వైపు ఇదే గ్రామానికి చెందిన బండారి వెంకయ్యతో కలిసి వెళ్లాడు. బెజ్జంకి మండలం దాచారం గ్రామానికి చెందిన తాడెం నరేష్ గూడ్స్ ఆటోతో అతి వేగంగా నడుపుతూ వెనుక నుంచి లక్ష్మయ్యను ఢీ కొట్టాడు. దీంతో లక్ష్మయ్యకు తీవ్ర గాయాలుకాగా, పక్కనే ఉన్న వెంకయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. లక్ష్మయ్యను 108 అంబులెన్సులో మొదటగా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాదుకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య గాండ్ల అంజలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి..


దుర్గయ్య (ఫైల్)

మునిపల్లి, జూన్12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దచెల్మెడ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దచెల్మెడ గ్రామానికి చెందిన చాకలి దుర్గయ్య(60) గ్రామంలోని ఫర్టిలైజర్ షాపులో మందులు తీసుకొని ఇంటికి వస్తున్నాడు. పీఏసీఎస్ కార్యాలయం వద్దకు రాగానే వెనుక నుంచి ఎంఆర్ఎఫ్ ఫ్యాక్టరికి సంబంధించి అశోక్ లేలాండ్ వాహనం అతడిని ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకెళ్లింది. బలమైన గాయలైన దుర్గయ్యను సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు చాకలి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపారు.

మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి..


వ్యక్తి మృతదేహం

నర్సాపూర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రోడ్డు ఎక్కన పట్టణ సమీపంలోని ఆనంద్‌గార్డెన్ వద్ద మానసిక స్థితి బాగలేని బిక్షాటన చేసుకుని జీవించే గుర్తు తెలియని వ్యక్తి స్పృహకోల్పోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ లింగం, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పరిశీలించగా మృతిచెందిన కనిపించాడు. ఒంటిపై షర్టు ధరించలేదని, కేవలం పాయింటు కలిగి బక్కచిక్కి ఉన్నాడని పోలీసులు తెలిపారు. అతడి మానసికి స్థితి సరిగా లేదని, ఇక్కడ భిక్షాటన చేసుకుంటూ తిరిగేవాడని స్థానికులు తెలిపినట్లు చెప్పారు. మృతదేహాన్ని నర్సాపూర్ ఆసుపత్రి మార్చురికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


ములుగు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చెరువులో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన సంఘటన కొట్యాల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ములుగు మండల పరిధిలోని కొట్యాల గ్రామ శివారులో ఉన్న చెరువులో ఓ వృద్ధుడి మృతదేహం పైకి తేలింది. దీన్ని గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే ములుగు పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

కనిపించకుండా పోయిన కూతురు.. తండ్రి ఆత్మహత్య


దుర్గయ్య (ఫైల్)

టేక్మాల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూతురు కనిపించకుండా పోవడంతో తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఏఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గ్రామనికి చెందిన ఇర్నల చిన్న దుర్గయ్య (37)కు భార్య లలిత, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. పెద్ద కూతురు, కొడుకు వివాహాలు జరిగాయి. కొడుకు, కోడలితో కలిసి లలిత హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటారు. దుర్గయ్య, చిన్న కూతురు(15) టేక్మాల్‌లో ఉంటారు. ఆమె స్థానిక పాఠశాలలో ప్రస్తుతం పదో తరగతి చువుతున్నది. ఈ నెల 11న మధ్యాహ్నం నుంచి బాలిక కనిపించకుండా పోయింది. దీంతో రోజంతా కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. మనస్తాపంతో ఇంటికి వచ్చిన దుర్గయ్య రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం అన్న గంగారం ఇంట్లోకి వెళ్లి చూడగా దుర్గయ్య దూలానికి ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం


శివకుమార్ (ఫైల్)

చిలప్‌చెడ్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): యువకుడు అదృశ్యమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గంగారం గ్రామానికి చెందిన మంగలి శివకుమార్(26) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో భోజనం చేసిన తర్వాత శివకుమార్ ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులపోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయే సమయంలో మెరూన్ కలర్ షర్ట్, క్రీం కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, చామన చాయ కలర్, 5.5 అడుగుల ఎత్తు ఉంటాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. శివకుమార్ తల్లి మంగలి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

మేలైన విత్తనంతోనే.. మెరుగైన పంట

సాగులో విత్తన ఎంపికే కీలకం

- కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తం తప్పనిసరి
- నిషేధించిన బీజీ-3 విత్తనాలతో భద్రం

గజ్వేల్, జూన్ 12 (ఆంధ్ర జ్యోతి): వ్యవసాయ రంగంలో పంటల సాగులో దిగుబడులను అధికంగా సాధించాలంటే శ్రేష్ఠమైన విత్తనాన్ని ఎంచుకోవడం చాలా కీలకంగా వ్యవహరించాల్సి ఉన్నది. విత్తనాన్ని ఎన్నుకునే క్రమంలో ఆయా భౌగోళిక వాతావరణ పరిస్థితులను అనుసరించి ముందడుగువేయాలి. సమీప ప్రాంతాల్లోని వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని, వ్యవసాయ అధికారులను, వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రందించి కాలానుగుణంగా వివిధ పంటలలో విత్తుకొనే విత్తనాలను తగు జాగ్రత్తలతో కొనుగోలు చేయడం అనేది రైతులు ప్రముఖ విధి. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోని యెడల పంటల సాగులో విత్తనం మొలకెత్తకపోవడం, ఎక్కువగా తెగుళ్లు, చీడపీడలు ఆశించడం వల్ల పంట నష్టం జరుగుతుంది. దీన్ని గమనించి రైతులే విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తనం తీసుకున్న వెంటనే తప్పనిసరిగా రసీదును తీసుకోవాలి. దీంతో భవిష్యత్తులో విత్తనంలో ఏదైనా లోపం ఏర్పడితే అధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది.

విత్తన ఎంపికలో ఇవే కీలకం

విత్తనాలు ఉన్న సంచులు సరైన సీలుతో ధ్రువీకరణపత్రంతో ఉన్న వాటినే కొనుగోలు చేయాలి. విత్తన సంచులపై విత్తన రకం, ల్యాట్ నంబర్, గడువు తేదీ తదితర వివరాలు సరిగా ఉన్నాయో లేవో చూసుకున్న తర్వాత మాత్రమే కొనుగోలు చేయాలి. విత్తనాన్ని కొనుగోలు చేసిన తర్వాత అధీకృత డీలర్ నుంచి బిల్లుపై సంతకం తీసుకోవడం, హైబ్రిడ్ విత్తనం కొనుగోలు చేసేటప్పుడు విత్తనరకం, భౌతిక స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యుపర నాణ్యతను లేబుల్ మీద ఉన్నాయో లేదో గమనించాలి. విత్తనాన్ని దుకాణదారుడి నుంచి కొనుగోలు చేసి ఇంటివద్దనే విత్తన మొలకశాతాన్ని పరీక్షించుకున్న తర్వాత సంతృప్తికరంగా ఉంటేనే



బీజీ-3 విత్తనాలతో జాగ్రత్త..

మార్కెట్‌లో పత్తి విత్తనాలు బోల్‌గార్డ్-3(బీజీ-3)ని పలు ప్రాంతాల నుంచి వ్యాపారులు, గుమాస్తాలు తీసుకువచ్చి గ్రామాలలో అమ్ముతున్నారు. రెండు, మూడేళ్ల క్రితం వరకు ఈ బీజీ-3కి భారీ మొత్తంలో గిరాకీ ఉండేది. కానీ ప్రభుత్వం ఈ విత్తనాలను అమ్ముతున్న వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయడం, విత్తన సరఫరాలో క్షుణ్ణంగా దర్యాప్తులు చేస్తుండడం, నిఘాను పటిష్టం చేయడం, విత్తనాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతో కొంత మేర ఈ విత్తనాన్ని విత్తుకునేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. అంతేకాకుండా ఈ విత్తనాలు నాటడం ద్వారా నామమాత్రపు ఫలితాలే వస్తుండడంతో రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో ములుగు, గజ్వేల్, హుస్నాబాద్ వ్యవసాయ డివిజన్లలో అక్కడక్కడా మారుమూల గ్రామాల్లో బీజీ-3ని విక్రయించినా ప్రస్తుతం రైతులు బీజీ-3 పట్ల పూర్తి స్థాయి అవగాహనతో ఉన్నారు.. వీటి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండడంతో పాటు తోటి రైతులను అప్రమత్తంగా ఉంచాల్సిన బాధ్యత ఉంది.

మార్కెట్‌లో విత్తన రకాలు...

- **బ్రీడర్ సీడ్:** ఈ రకం విత్తనం అన్ని రకాల విత్తనాలకు మూలవిత్తనం. దీన్ని రూపొందించిన పరిశోధనా స్థానాలలోనే ఆయా శాస్త్రవేతతల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. జన్యు స్వచ్ఛత 100శాతం ఉంటుంది. విత్తనం సంచులకు పసుపురంగు ట్యాగ్ ఉంటుంది.
- **ఫౌండేషన్ రకం విత్తనం:** ఈ రకం విత్తనాన్ని బ్రీడర్ విత్తనం నుంచి ఉత్పత్తి చేస్తారు. వివిధ పరిశోధనా స్థానాలు రాష్ట్ర విత్తనోత్పత్తి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న విత్తనాభివృద్ధి క్షేత్రాలలో సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. ఇవి కూడా దాదాపు 100శాతం జన్యుస్వచ్ఛత కలిగి ఉంటాయి. ఈ సంచులకు తెలుపురంగు ట్యాగ్ ఉంటుంది.
- **సర్టిఫైడ్ సీడ్:** ఈ రకం విత్తనాన్ని ఫౌండేషన్ విత్తనం నుంచి సీడ్ సర్టిఫికేషన్ వారి ఆధ్వర్యంలో రైతుల పొలాల్లో పండిస్తారు. ప్రయోగశాలల్లో పరీక్షించి నిర్దేశించిన ప్రమాణాలు కలిగిన వాటికి ధృవీకరణ విత్తనం లేబుల్ ఇస్తారు. దీనికి నీలిరంగు ట్యాగ్ ఉంటుంది. మార్కెట్‌లో ఉత్పత్తిదారులు సొంత హామీకత్తుతో ట్రూత్‌ఫుల్ లేబుల్ అనే ట్యాగ్ వేసి విత్తనాలను అమ్ముతుంటారు. వీటి లేత ఆకుపచ్చ రంగు ట్యాగ్‌ను వాడతారు. వీటిని ఉత్పత్తి చేసే సంస్థ, వ్యక్తులను బట్టి విత్తన కొనుగోలు చేస్తారు. విత్తన ఎంపికలో ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా చేసిన కష్టం బూడిదలో పోసిన పన్నీరు మారుతుంది. కావున రైతున్నలు తప్పనిసరిగా విత్తన ఎంపికను ప్రథమ ప్రాధాన్యత పెట్టుకోవాలి.

పొలంలో విత్తుకోవాలి. విత్తనంలో మొలకశాతం తక్కువగా ఉంటే కొనుగోలు చేసిన దుకాణదారుడి దగ్గరకు తీసుకువెళ్లి పరిస్థితిని వివరించి వేరే విత్తనాన్ని తీసుకోవాలి. విత్తనంలో గల లోపాన్ని వివరించిన తర్వాత దుకాణదారుడు సరైన విధంగా విత్తనాన్ని మార్చి ఇవ్వకపోతే సదరు డీలర్‌పై వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధంగా చేసిన యెడల విత్తన పరిహారం పొందే హక్కు రైతులకు ఉంటుంది. పంటలకు నష్టం జరిగితే రైతుకు రసీదే కీలకం ఆధారం. కాబట్టి పంట కాలం పూర్తయ్యే వరకు కొనుగోలు చేసిన బిల్లును జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. సీల్ తీసి ఉన్న విత్తన సంచులు, పగిలిన విత్తన ప్యాకేట్లు, మూతలు తీసిన డబ్బాల్లోని విత్తనాన్ని కొనుగోలు చేయవద్దు. విత్తనాన్ని కొనుగోలు చేసే క్రమంలో విత్తన సంచి బరువు తక్కువగా అనిపిస్తే డీలర్ ముందు తూకం వేయించి తక్కువగా ఉన్న విత్తనాన్ని డీలర్‌కు ఇచ్చి కొత్త విధానాన్ని తీసుకోవాలి. విత్తనం మొలకదశలో, పూత దశలో పంటల ఎదుగుదల సరిగా లేకపోతే వెంటనే వ్యవసాయాధికారులకు తెలియజేసి క్షేత్రానికి తీసుకువెళ్లి చూపించాలి. విత్తన ఎక్కడ తయారీ అయిందో ఏ కంపెనీ పంపిణీ చేసిందో విత్తన అమ్మిన దుకాణదారుడి ద్వారా తెలుసుకోవాలి. వీటిలో ఏ విధమైన సంతృప్తి సమాధానం పొందలేని యెడల వ్యవసాయశాఖ అధికారులకు వెంటనే ఫిర్యాదు చేయాలి.

సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

- కేంద్ర మంత్రికి ఎంపీ వినతి



కేంద్రమంత్రి సంజయ్‌సేత్‌ను కలిసి ఎంపీ రఘునందన్‌రావు

రామచంద్రాపురం టౌన్ జూన్ 12 (ఆంధ్ర జ్యోతి) :రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ రఘునందన్‌రావు కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర రక్షణశాఖ మంత్రి సంజయ్‌సేత్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ విభాగంలో పని చేయడానికి యువత సిద్ధంగా ఉన్నందున పాఠశాల స్థాయి నుంచే సన్నద్ధం చేయాల్సిన అవసరముందన్నారు. ఇందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్, పక్కన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఖేడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారన్నారు. అనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణులు మున్వర్ ముజాం మాట్లాడారు. కార్యక్రమంలో శాహీన్ ఇన్‌స్టిట్యూషన్ ఛైర్మన్ ఖాదిర్, నారాయణఖేడ్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు రషీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహేర్, బారిసేట్, బాసిత్, అమృత్, మైనోద్దీన్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతగా..

నాచగిరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఉద్యోగులు

వర్గల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల అర్చకులు, ఉద్యోగులకు మేలు చేసేలా ప్రభుత్వం పలు ప్రకటనలు చేయడంపై నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం అర్చకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ నిధి ట్రస్ట్ నుంచి రిటైర్మంట్ గ్రాడ్యూటి రూ.4లక్షల నుంచి 8లక్షలకు పెంచడం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ గ్రాంట్ గరిష్ఠంగా రూ.2 లక్షలు చేయడం, ధూప దీప నైవేద్య అర్చకులకు గ్రాట్యూటీ అమలు చేయడంపై సంతోషంగా ఉందన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విసుగు

● అస్తవ్యస్తంగా పథకాల అమలు ● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, జోన్ 12 (ఆంధ్రజ్యోతి): పథకాల అమలు అస్తవ్యస్తంగా మారడంతో కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. చేగుంట మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీ 20వ బ్రహ్మోత్సవ వార్షికోత్సవానికి ఆయన హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ వికాస్ తదితర పథకాలు పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా మారాయయన్నారు. అన్నారు. పేదలు ఇందిరమ్మ ఇళ్లపై గంపెడు ఆశ పెట్టుకున్నారన్నారు. కానీ ప్రభుత్వం 60 గజాల ఇల్లు ఉండాలని నిబంధన పెట్టి చాలా మంది అర్హులను ఇల్లు కట్టకుండా చేస్తున్నారన్నారు. వానకాలం, పాఠశాలలు ప్రారంభమైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంబంధిత శాఖల అధికారులతో కనీసం సమీక్షలు జరుపడం లేదన్నారు. జిల్లా మంత్రులు హైదరాబాద్‌కు పరిమితమయ్యారన్నారు. గ్రామపంచాయతీలకు ట్రాక్టర్లకు డీజిల్ పోయలేని దుస్థితి నెలకొందన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ నగేష్, సభ్యులు నాగభూషణం, వెంకటేశం, భాలేశం, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, నాయకులు విశ్వేశ్వర్, డిష్ రాజు, అన్నం రవి, శ్రీకాంత్, నాగరాజు, తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్

రేగోడ్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రేగోడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలలో కాంట్రాక్టు అధ్యాకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి స్వయంప్రభ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వంట మనిషి కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 18 వరకు గడువు ఉందని, అర్హతను బట్టి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

రైతు భరోసా దరఖాస్తుకు ఈ నెల 20 వరకు గడువు

నారాయణఖేడ్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20 వరకు గడువు ఉందని ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 5వ తేదీ లోపు భూమిని పట్టా చేసుకున్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ ప్రతులను ఏఈవోలకు అందజేయాలన్నారు.

అయ్యో.. ఎంతపనైంది

- 'పది'లో పాఠశాల టాపర్ చిన్న తప్పిదంతో ఉన్నత చదువులకు ఆటంకం
- గురుకుల కళాశాల సీటు కోసం చేసిన దరఖాస్తులో ఫిమేల్‌కు బదులు మేల్ నమోదు
- బాయ్స్ కళాశాల సీటు కేటాయింపు
- ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వినతి



అక్షిత

కొండాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి ఫలితాల్లో పాఠశాల టాపర్‌గా నిలిచిన అమ్మాయికి ఒక చిన్న తప్పిందంతో పై చదువులకు ఆటంకంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్ మండలం సీ కోనాపూర్ గ్రామానికి చెందిన కూరికుల అక్షిత పదో తరగతిలో 544 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. పైచదువుల కోసం సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీలో చేరేందుకు నిర్ణయించుకున్నది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఆన్‌లైన్ కేంద్రంలో అడ్మిషన్ కోసం మే 14న దరఖాస్తు చేసుకున్నది. ఈ నెల 5న హైదరాబాద్ పరిధిలోని చిలుకూర్ గురుకుల కళాశాలలో సీటు రావడంతో కౌన్సెలింగ్ రావాలని మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. తల్లిదండ్రులతో కలిసి కౌన్సిలింగ్‌కు వెళ్లిన అక్షితకు అది మహిళా కళాశాల కాదు.. బాయ్స్ కళాశాల అని తేలడంతో వారు కంగు తిన్నారు. ఈ విషయమై ఆరా తీయగా దరఖాస్తు సమయంలో పొరపాటున ఫిమేల్‌కు బదులు మేల్ నమోదు చేయడమే అని తెలిసింది. దీనిపై దరఖాస్తు చేసిన సెంటర్ నిర్వాహకుడిని నిలదీయగా వివరాలన్నీ మీరు సరిచూసుకోవాలని, తమకు సంబంధం లేదంటూ చెప్పినట్లు అక్షిత అవేదన వ్యక్తం చేసింది. విద్యార్థి ప్రతిభను గుర్తించి మహిళా గురుకుల కళాశాలలో సీటును కేటాయించి న్యాయం చేయాలని సోషల్ వెల్ఫేర్ అధికారులను విద్యార్థి అక్షిత, తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే నమోదులో తప్పిదం చేసిన నిర్వాకుడిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎవరెస్ట్ అధిరోహించిన ఎంజేపీ స్కూల్ విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లోని ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంప్‌ను సిద్దిపేట నారాయణరావుపేట మహాత్మాజ్యోతిరావు పూలే బాయ్స్ స్కూల్ విద్యార్థి దినేష్ అధిరోహించాడు. అడ్వెంచర్ క్యాంపులో భాగంగా ఎంజేపీ (మహాత్మా జ్యోతిరావుపూలే) సొసైటీ నుంచి 10మంది బాలికలు, 10మంది బాలురు గత నెల 25న నేపాల్ వెళ్లారు. వారిలో సిద్దిపేట ఎంజేపీ స్కూల్ (నారాయణరావుపేట) 9వ తరగతి విద్యార్థి దినేష్ ఉన్నారు. ఈ నెల 3న విద్యార్థులు శిఖరం అధిరోహించారని ఎంజేపీ బాయ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగలత తెలిపారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ఎక్కిన విద్యార్థి దినేష్‌ను ప్రిన్సిపాల్ సహా, పీఈటీ వెంకటేష్, ఉపాధ్యాయులు అభినందించారు. ఎవరెస్టు బేస్ క్యాంప్‌ను అధిరోహించడానికి విద్యార్థులు బయలుదేరేటప్పుడు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల సెక్రటరీ బడుగు సైదులు అభినందించినట్లు తెలిపారు.



ఎవరెస్టుపై విద్యార్థులు, దినేష్ (ఇన్‌సెట్‌లో)

చేర్యాలలో విరుచుకుపడిన వీధి కుక్క.. 15 మందికి గాయాలు

చేర్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని కేపీ ఆర్‌నగర్ కాలనీలోని ఓ వీధిలో పిచ్చికుక్క ప్రజలపై విరుచుకుపడింది. కాలనీ శివారులోని ఓ ఇంట్లో శుభకార్యానికి పలువురు హాజరవగా ఆకస్మాత్తుగా కుక్క దాడి చేసి 10మందిని కరిచింది. అంతకుముందు కాలనీ సమీపంలోని మూలమలుపు వద్ద మరో ఐదుగురిపై దాడి చేసింది. గమనించిన చుట్టుపక్కల వారు కుక్కను కొట్టి చంపడానికి యత్నించగా పరారైంది. పలువరు చేర్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకోగా, తీవ్ర గాయపడిన ఒకరిని సిద్దిపేటకు తరలించారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మూల మహోత్సవాలు



వర్గల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయంలో మూల మహోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం వేడుకలకు అంకురార్పణ చేయగా అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద చండీ హోమం, భక్తులు, వేద విద్యార్థులచే లక్ష పుష్పార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను అందజేశారు.



అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న వేద విద్యార్థులు, భక్తులు

ఇందిరానగర్ బడి.. నూతన ఒరవడి

(5వ పేజీ తరువాయి)

డిజిటల్ కంటెంట్ విద్యావిధానాన్ని ఈ పాఠశాల విద్యార్థులకు పరిచయం చేయడానికి సొంత ఖర్చులు పెట్టుకున్నారు. తద్వారా పదో తరగతి ఫలితాల్లో అత్యధిక ర్యాంకులు ఈ పాఠశాలలకు రావడానికి దోహదం చేశారు. ప్రధానమంత్రి పథకానికి సైతం ఈ పాఠశాల ఎంపికైంది.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు..

సాధారణంగా ఇంజనీరింగ్, మెడికల్, డిగ్రీ, గురుకులాల్లో సీట్ల కోసం ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తులు చేస్తుంటారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు ఈ విధానం ఇంకా పాకలేదు. కానీ ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలలో గత ఏడాది నుంచే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పాఠశాలకు సంబంధించి ఒక క్యూఆర్ కోడ్‌ను రూపొందించారు. ఈ కోడ్‌ను స్కాన్ చేయగానే దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ అవుతుంది. ఇందులో విద్యార్థుల వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేయవచ్చు. అదే విధంగా దరఖాస్తు పత్రాలను స్కూల్‌లో సమర్పించేలా చర్యలు చేపట్టారు.

మానవీయ కోణంలో ఎంపిక

ప్రతీ ఏటా 6వ తరగతి కోసం కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ ఏడాది 180 సీట్లు 6వ తరగతిలో ఖాళీగా ఉన్నాయి. ఇందుకు 600పైగా దరఖాస్తులు వచ్చారు. మరో 200పైగా దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నారు. అన్ని దరఖాస్తులను పరిశీలించి ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. దీనికి ముందు అనాథలు, సింగిల్ పేరెంట్ పిల్లలు, పేద విద్యార్థుల వివరాలు సైతం సేకరిస్తారు. మానవతా కోణంలో పరిశీలన చేశాకనే ఈ సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలితే ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారు. అంతేగాని ఎలాంటి పైరవీలు,



దరఖాస్తు ఫారాలను పాఠశాలల్లో అందజేస్తున్న విద్యార్థులు

పలుకుబడులకు తావుండకుండా చూసుకుంటారు.

ర్యాంకులన్నీ ఇదే స్కూల్‌కు..

గడిచిన ఏడాది 242 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో పదో తరగతి చదివారు. వీరిలో 74 మంది విద్యార్థులకు 500 పైగా మార్కులు వచ్చాయి. 550 పైగా మార్కుల జాబితాలో 15 మంది నిలిచారు. వీరందరికీ కూడా కార్పోరేట్ ఇంటర్ కళాశాలలు ఉచితంగా రెసిడెన్షియల్ విద్య అందిస్తామని అగ్రిమెంట్ చేసుకున్నారు. క్రితంసారి 32 మందికి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు రాగా, గత ఏడాది 17 మందికి వచ్చాయి. ఈసారి కూడా పదుల సంఖ్యలోనే బాసరకు క్యూకట్టనున్నారు. సిద్దిపేట జిల్లాలో ఎస్సెస్సీలో మొదటి 10 మంది టాపర్లలో ఆరుగురు ఇందిరానగర్ పాఠశాల విద్యార్థులే అని చెప్పడం అతిశయోక్తి కాదు. ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు 14 మంది విద్యార్థులు ఎంపిక కావడం కూడా రికార్డే.

అంకితభావంతో విధుల నిర్వహణ



మా స్కూల్ ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించడమే ఈ సక్సెస్‌కు కారణం. అందరూ ప్రత్యేకంగా చొరవ తీసుకుంటారు. గత ఏడాది అక్టోబరు నుంచి పరీక్షలు పూర్తయ్యేవరకు ఉదయం 8.30గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు తరగతులు చెప్పారు. మా నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు కూడా మంచి మార్కులు తెచ్చుకున్నారు. ఇదే స్ఫూర్తితో మరింత శ్రమిస్తాం.

- రాజప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు


సీటు వస్తే సిద్దిపేటకు షిఫ్టయితాం



ఇందిరానగర్ స్కూల్‌లో సీటు వస్తే మా అబ్బాయి భవిష్యత్తు బాగుపడుతుంది. ప్రైవేట్ స్కూళ్ల కన్నా ఇక్కడ చక్కగా చదువు చెబుతారు. సీటు కోసం సార్లను పలుమార్లు అడిగాను. దరఖాస్తు చేసుకొమ్మంటే చేసుకున్నాను. మేము కొండపాకలో ఉంటున్నాం. మా బాబుకు సీటు వస్తే సిద్దిపేటకు షిఫ్టయితాము.

- నర్సింలు, విద్యార్థి తండ్రి, కొండపాక

ఇంతకన్నా తృప్తి ఏముంటుంది



ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలను నా మానస పుత్రికలా భావించాను. విద్యార్థుల సంఖ్యను పెంచడం నుంచి ఈ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేవరకు తగిన కృషి చేశాం. నా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రగతికి అనేక చర్యలు చేపట్టాను. ఈరోజు ఇందిరానగర్ స్కూల్ సాధిస్తున్న ఫలితాలను చూస్తుంటే ఓ ప్రజాప్రతినిధిగా ఇంతకన్నా తృప్తి నాకు ఇంకేముంటుంది.

- హరీశ్‌రావు, సిద్దిపేట ఎమ్మెల్యే

న్యూస్ బాక్స్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా

జగదేవ్‌పూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు దాసరి ఐలయ్య యాదవ్ అన్నారు. గురువారం జగదేవ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐలయ్య మట్లాడుతూ మండలంలో బూతు స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం పూర్తి స్థాయి నూతన మండల కమిటీని ప్రకటించడం జరిగిందన్నారు. తనపై నమ్మకం ఉంచి రెండవసారి మండల అధ్యక్షునిగా ఎంపిక చేసిన రాష్ట్ర, జిల్లా, మండల బీజేపీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అంబులెన్స్ అందజేత

కొండపాక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొండపాక శివారులోని సత్యసాయి సంజీవని హార్ట్‌కేర్ సెంటర్ కు లయన్స్ క్లబ్ వారు మొబైల్ అంబులెన్స్ వాహనాన్ని ఆస్పత్రి ప్రతినిధి జగన్నాథ శర్మకు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆదర్శ వారు రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మాజీ ఐఏఎస్ కె.వి రమణాచారి ఆధ్వర్యంలో మొబైల్ మెడికల్ అంబులెన్స్ వాహనాన్ని అందజేశారు. కార్యక్రమంలో లయన్ క్లబ్- ఆదర్శ ప్రతినిధులు నయన దేవి , సుబ్బలక్ష్మి , కృష్ణకుమారి, సుజాత,లయన్ సూర్యనారాయణ, ప్రెసిడెంట్ లయన్స్ క్లబ్- అపూర్వ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి వాకాటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కొమురవెల్లి, జూన్12(ఆంధ్రజ్యోతి):ఇటీవల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాకాటి శ్రీహరిముదిరాజ్‌ని కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎల్లం యాదవ్,ఆర్గనైజింగ్ సెక్రటరీ జంగాని రవి,మండల సెక్రటరీ సార్ల లింగం,సోషల్ మీడియా కన్వీనర్ చింతల రమేష్,ఎంటె శ్రీనివాస్,తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నూతనంగా రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వాకాటి శ్రీహరిని గురువారం హైదరబాద్ లోని అయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజల హరికృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ మంత్రికి అధ్యాపకుల వినతి

చిన్నకోడూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులకు స్థానిక బీసీ, ఎస్సీ హస్టల్‌లో వసతి కల్పించాలని కళాశాల అధ్యాపకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులకు హస్టల్ వసతి కల్పిస్తే కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ విషయం పై మాజీ మంత్రి హరీశ్‌రావు సానుకూలంగా స్పందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వంతోనే ఇందిరమ్మ ఇళ్లు



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్

ములుగు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిధులతోనే ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తుందని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు బిజెపి నాయకులు వినతిపత్రం అందజేశారు.

గజ్వేల్ మండల్ల నూతన కమిటి

గజ్వేల్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల భారతీయ జనతా పార్టీ మండల కమిటీ నియామకం చేసిన మండల అధ్యక్షులు అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా బీన మైన ప్రభాకర్, భీంకుమార్, శివగల్ల శ్రీకాంత్‌గౌడ్, శాతం స్వామి, చాలరి రాజ, మండల ప్రధాన కార్యదర్శులుగా ఇప్ప స్వామి, బారు అరవింద్, కోషాధికారిగా పంజా బాలయ్య, కార్యదర్శులుగా కూర స్వామి, వినోద్‌కుమార్, నరసింహారెడ్డి, చంద్రంతో పాటు మండల కార్యవర్గ సభ్యులుగా 34 మంది సభ్యులుగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన కమిటీలో ఎన్నికైన సభ్యులు మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

లద్నూరులో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

మద్దూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లద్నూరు గ్రామ రైతు వేదికలో తోర్నాల వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాస్త్రవేత్త డి. శ్వేత మాట్లాడారు. అధికారుల సిఫారసు మేరకే అవసరాన్ని బట్టి యూరియాతో పాటు రసాయనాలను వాడాలని సూచించారు.



పోతారం(ఎస్)లో వినూత్నంగా విద్యార్థులను పాఠశాలకు ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు



హుస్నాబాద్‌లోని పాఠశాలలో సౌకర్యాలు, పూర్వ విద్యార్థుల సాధించిన మార్కులతో ఏర్పాటు చేసిన ప్లెక్సీ

సర్కారు బడి పిలిచింది



కొండపాకలో నూతనంగా చేరే విద్యార్థుల తల్లిదండ్రులను స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు వేసవి సెలవుల తర్వాత గురువారం పునఃప్రారంభమయ్యాయి. నూతనంగా చేరే విద్యార్థులు , ఉపాధ్యాయులకు పాఠశాల సిబ్బంది అనేక రకాలుగా స్వాగతం పలికారు. పాఠశాలలను మామిడి తోరణాలతో అలంకరించారు.

-న్యూస్‌నెట్‌వర్క్ , జూన్ 12 (ఆంధ్రజ్యోతి)



చిన్నకోడూరు మండలంలో మామిడి ఆకుల తోరణాలతో అలంకరించిన రామంచ ప్రాథమిక పాఠశాలకు

నేలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది

రాయపోల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు నేలను పరిరక్షించుకున్నప్పుడే మంచి దిగుబడులు సాధించగలుగుతారని తోర్నాల వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి జయ సూచించారు. గురువారం రాయపోల్ మండలం వడ్డెపల్లిలో తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం, జిల్లా వ్యవసాయ శాఖ వారు సంయుక్తంగా వానాకాలంలో మెరుగైన సాగు పద్దతులపై రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త జయ మాట్లాడుతూ సేంద్రీయ, పచ్చిరొట్ట ఎరువులు వాడడం ద్వారా నేలను సంరక్షించవచ్చని తె లిపారు. పంటల్లో మోతాదుకు మించి యూరియా, పురుగు మందులు వాడవద్దని హెచ్చరించారు. విత్తనాలు పురుగు మందులు కొన్నప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకురావాలని సూచించారు. సాగునీటిని ఆదా చేసే ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. పంటలను మార్పిడి చేయడం వల్ల చీడపీడ బెడద నివారించడంతో పాటు పంటలు ఇతర రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రాజా, గజ్వేల్ ఏడీఏ బాబూనాయక్, ఏవో నరేష్, ఏఈఓ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

అందరం కలిసి మంచిని పెంచాలి

● మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్ రావు

సిద్దిపేట కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అందరం కలిసి సమాజంలో మంచిని పెంచే విధంగా, ప్రేమను పంచే విధంగా ఆత్మీయతతో జీవించి కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేలా సమాజాన్ని ముందుకు నడిపించాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట ఆదర్శనగర్‌లోని క్రిస్టియన్ భవన్‌లో గురువారం జరిగిన పాస్టర్ల సమావేశానికి హరీశ్ రావు హాజరై పాస్టర్లనుద్దేశించి మాట్లాడారు. ఎవరైనా ద్వేషాన్ని పెంచే ప్రయత్నం చేస్తే, ఆ ద్వేషాన్ని తుంచే ప్రయత్నం చేయాలన్నారు. ఇతరుల పట్ల ప్రేమ, దయా గుణం, సహాయం చేసే గుణాన్ని పెంపొందించాలన్నారు. దైవ సేవకులుగా ఈ బాధ్యత మీ మీద, రాజకీయ నాయకులుగా మా మీద ఎక్కువగా ఉంటుందన్నారు. అందరం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, దేశం బాగుంటుందన్నారు. సిద్దిపేటలో హిందువుల కోసం వేద భవనం, ముస్లింల కోసం హజ్ హౌస్, క్రైస్తవుల కోసం క్రైస్తవ భవనం నిర్మించామని గుర్తుచేశారు. గాడ్ విజన్ కార్యక్రమం సిద్దిపేటలో ప్రారంభమై రాష్ట్రం మొత్తానికి విస్తరించిందన్నారు. అంతకుముందు మాట్లాడిన పాస్టర్లు ఫ్రీజర్లు కావాలని కోరగా వెంటనే స్పందించిన హరీశ్‌రావు నంగునూరు, చిన్నకోడూరుకు మండలాలకు రెండు ఫ్రీజర్లను అందిస్తామని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా, ఆపద వచ్చినా తానూ అండగా ఉంటానని హమీ ఇచ్చారు.

ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి

● అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఆయిల్ ఫెడ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ జిల్లాలో ఇప్పటివరకు 12,339 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతుందని, అలాగే 2025-26 సంవత్సరానికి గాను 6500 ఎకరాల లక్ష్యం పెట్టుకొని ఇప్పటివరకు 2191 ఎకరాలు 607 మంది రైతులను గుర్తించడం, 355 రైతుల నుండి 1138 ఎకరాల డిడి కలెక్షన్ జరిగిందని తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంట 955 టన్నుల గెలలు కటింగ్ చేసి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట లో ఉన్న ఫ్యాక్టరీ పంపినట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని జిల్లాకు ఇచ్చిన 6500 ఎకరాల లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సమగ్ర సస్యరక్షణ చర్యల ద్వారా పంటల దిగుబడి

● శాస్త్రవేత్తలు డాక్టర్ శరత్ చంద్ర

సిద్దిపేట రూరల్,జూన్ 12(ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా పంటల దిగుబడి పెరుగుతుందని మెట్ట పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శరత్ చంద్ర రైతులకు సూచించారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలో వికసిత కృషి సంకసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంతో రైతులకు అవగహన కలిగించారు. ఈ సందర్భంగా రైతులకు నేల యొక్కత ఆరోగ్యం, మట్టి సేకరణ మరియు మట్టి పరీక్షల వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. వరి పంటలో అధిక దిగుబడినిచ్చే రకాల గురించి శాస్త్రవత్తలు అవగహన కలిగించారు. రసాయనత ఎరువులవాడకం వల్ల కలిగే నష్టాలను తెలిపారు.

కారు మబ్బులు కమ్ముకున్న వేళ



ఆకాశం మేఘావృత్తమై కారు మబ్బులు కమ్ముకున్న దృశ్యం

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యునిఫామ్స్ పంపిణీ

తొగుట/కొమురవెల్లి,జూన్12(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల విద్యాధికారి బొమ్మగోని రమేష్, అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాల ఛైర్మన్ శోభారాణి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, ఐడీ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏంఈవో మాట్లాడుతూ...ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తున్నదనీ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామనీ తెలిపారు.

తొగుట మండలం ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు యూనిఫామ్స్‌తో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను ఎంఈవో నర్సయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి



ప్రకృతి వ్యవసాయం మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వసంతరావు

జగదేవ్‌పూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. గురవారం జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజ్‌పేట్‌లో ప్రకృతి వ్యవసాయం మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో వసంతరావు మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ప్రకృతి సేద్యంపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

జగదేవ్‌పూర్/తొగుట/దౌల్తాబాద్/మిరుదొడ్డి,జూన్12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న భూభారతిలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. గురువారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి భూసమస్యలను నెలకొన్న కూడా భూభారతితో దరఖాస్తును చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. భూ సమస్యలు పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. గురువారం తొగుట మండలం లింగంపేట గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన వెంటనే విచారణ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోద్ చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. పెండిగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కరానికి భూ భారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. ధరణి పోర్టల్ ద్వారా రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్‌రెడ్డి ధరణిని తొలగించి భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని గజ్వేల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఒంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం జగదేవ్‌పూర్ మండలంలోని గొల్లపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. .

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన

చేర్యాల/మద్దూరు/సిద్దిపేరూరల్/వర్గల్/ములుగు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలో దొరుకుతుందని అధికారులు చెబుతున్నారు. సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి కమిషనర్ కృష్ణారావు గురువారం సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన ములుగు జిల్లా పరిషత్ పాఠశాలలో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర పరీశీలకులు విద్యాశాఖ పరీక్షల విభాగం ప్రభుత్వ కమిషనర్ కృష్ణారావు హాజరై మాట్లాడుతూ పాఠశాలలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం వారికి సమకూర్చిన పుస్తకాలు బట్టలు బహూకరించడం జరిగింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా నేడు తల్లిదండ్రుల సమావేశంను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ములుగులో నిర్వహించడం జరిగింది. ములుగు పాఠశాల అన్ని వసతులు కలిగి ఉన్నదని, కావున తల్లిదండ్రులు ప్రభుత్వంపై నమ్మకం ఉంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానినికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గురువారం వర్గల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయి ప్రమాణాలతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రవేటుకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తూ ప్రతిభవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పై దృష్టి సాధిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులతో కూడిన నాణ్యమైన విద్యా బోధన అందించడం జరుగుతుందని సిద్దిపేట రూరల్ మండల విద్యాధికారి రాజిరెడ్డి తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నారని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని మద్దూరు ఎంపీడీవో ఎస్. రాంమోహన్ తెలిపారు . విద్యార్థులు చక్కటి విద్యాభాస్యాన్ని కొనసాగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్నబోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని చేర్యాల ఎంఈవో రచ్చ కిష్టయ్య అన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



ములుగు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో భోజనం చేస్తున్న కమిషనర్ కృష్ణారావు

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి దాసరి పవన్

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సేవ చేయాలన్న పవన్ కళ్యాణ్ తపనను ప్రజల్లోకి తీసుకు వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని జనసేన పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి దాసరి పవన్ పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జనసేన పార్టీ క్రియాశీల కార్యకర్తలకు సభ్యత్వ నమోదు కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి పవన్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రియాశీల కార్యకర్తలకు సభ్యత్వ కిట్లు అందజేశారు.

ఎమ్మెల్యే పల్లా కోలుకోవాలని పూజలు

చేర్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌లో ప్రమాదవశాత్తు గాయపడి సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజే శ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ నాయకులు, పల్లా అభిమానులు ప్రత్యేక పూజలు చేపట్టడంతో పాటు తమ ఇష్టదైవాలకు ముడుపులు కడుతున్నారు. గురువారం చేర్యాల మండలానికి చెందిన పల్లా అభిమానులు కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి

సిద్దిపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించే ముందు కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరవుతున్న సందర్భంగా కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం మీద ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం సరికాదన్నారు. పదేళ్ల కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వం బయటకు తీస్తే, ఓర్వలేక మాట్లాడటం మంచి పద్ధతి కాదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి బిఆర్ఎస్‌కు రేవంత్‌రెడ్డిని చూస్తేనే భయం పడుతున్నదన్నారు. మాజీ మంత్రిగా, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్ స్థాయిని మరిచి చిల్లర నాయకుడిలాగ మాట్లాడుతున్నారని తెలిపారు. నీ తండ్రి చేసిన అవినీతిపై దమ్ముంటే నిలదీయాలని డిమాండ్ చేశారు. అవినీతి చేసి పైగా దబాయించి మాట్లాడుతున్నారని, ఇక్కడ ఎవరు భయపడరని, అలా దబాయించి మాట్లాడితే నిజం అబద్ధం కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, సలీం, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నాం

సిద్దిపేట అభివృద్ధికి రూ. 2.60 కోట్ల నిధులు ..

సిద్దిపేట , జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధికి రూ. 2.60 కోట్ల నిధులు మంజూరు అయినట్లు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజల హరికృష్ణ తెలిపారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ప్రత్యేక కృషితో సిద్దిపేట అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

మజీద్‌పల్లిలో మా కే నామ్‌పే ఏక్ పేడ్



మజీద్‌పల్లిలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

వర్గల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వం పూర్తి చేసుకున్నందుకు గాను వర్గల్ మండలం మజీద్‌పల్లిలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మాకే నామ్ పే ఏక్ పేడ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

ఉల్లాస్ ద్వారా విద్యాభ్యాసాన్ని కొనసాగించాలి

● ఎంఈవో

మద్దూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్ ద్వారా పూర్తి స్థాయిలో అక్షరాస్యులుగా మారడంతో పాటు చదువు మధ్యలో నిలిపివేసిన వారు విద్యాభ్యాసాన్ని కొనసాగించే మంచి అవకాశాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వరదరాజు తెలిపారు. గురువారం మండలంలోని రేబర్తి గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడంతో పాటు చదవు మధ్యలో మాని వేసిన వారిని 10 చదివించి పాసు చేయించడం, టెన్త్ చదవి మానివేసిన వాళ్లను ఓపెన్ ఇంటర్ చేయించడం జరుగుతుందన్నారు. ఇట్టి అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నందున అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దమ్మక్కపల్లి లో వికసిత కృషి సంకల్ప అభియాన్

కొండపాక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం దమ్మక్క పల్లిలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రానికి చెందిన కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి, సేంద్రీయ వ్యవసాయం గురించి వివరించారు. వ్యవసాయ సమాచారం పొందడానికి కిసాన్ సారథి పోర్టల్ గురించి రైతులకు తెలియజేశారు. ఖరీఫ్ సీజన్ వరి, పత్తి పంటల యాజమాన్య పద్ధతులు వివరించారు. రైతులకు సాంకేతిక సమాచారం అందించారు. రైతులు మంచి దిగుబడి కోసం శాస్త్రవేత్తలను , రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారుల సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. పశుపోషణ పశుగ్రాసం, పశుసంవర్ధకం గురించి డాక్టర్ సాలిని పలు సూచనలు చేశారు.

ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అడ్వకేట్ వెంకటేష్

కొండపాక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కొండపాక మండలం దుద్దెడ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కోర్టు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అడ్వకేట్ వెంకటేష్ బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటిన సీడీపీవో

చేర్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-11 ఆవ రణలో ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి గురువారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండున్నర నుంచి ఆరు సంవత్సరాలలోపు ఉన్న చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని, తద్వారా వారికి క్రమశిక్షణ, ఆటపాటలతో కూడిన విద్య లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తాటిపాముల కృష్ణవేణి, హెల్పర్ రాజమణి తదితరులు పాల్గొన్నారు.